
సాక్షి ఒడిశా

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,14,411లు, బంగారం 5గ్రాము 900 మిల్లీగ్రాములు, వెండి 38 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సవాలకు వేళాయె..!

రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నుంచి జరగనున్న చొయితి వేడుకలకు సర్వం సిద్ధమైంది.

- 8లో



వణికిస్తున్న చలి

జయపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

తల్లిని కట్టి కొట్టిన కొడుకు అరెస్టు

భువనేశ్వర్: కెంజొహార్ జిల్లాలోని చంపువా పోలీసుస్టేషన్ పరిధి సరసపోషి గ్రామంలో తోటలో క్యాబేజీ కోసినందుకు కన్నతల్లిపై కర్కశంగా దాడిచేసిన కొడుకు శతృఘ్న మహంత (39)ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సరసపోషి గ్రామానికి చెందిన సుభద్ర మహంత్‌కు ఇద్దరు కొడుకులు. తల్లి, కొడుకులంతా వేర్వేరుగా ఉంటున్నారు. సుభద్ర తన చిన్న కొడుకు శతృఘ్న మహంత తోటలో క్యాబేజీని కోసి వండుకుంది. ఈ విషయం తెలుసుకున్న కొడుకు తన తల్లితో గొడవ పడ్డాడు. అంతటితో ఆగక కోపంతో తల్లి సుభద్రను గ్రామం మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి తీవ్రంగా కొట్టాడు. అడ్డుకోబోయిన గ్రామస్తులపై ఎదురు దాడికి దిగి బెదిరించాడు. ఈ విషయమై గ్రామస్తులు చంపువ థాణా పోలీసులకు సమాచారం అందించారు. చంపువా పోలీసులు వచ్చి బాధితురాలు సుభద్రను రక్షించి బాసుదేబ్‌పూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అనంతరం కొడుకుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మారణాయుధాలతో దాడి

- ముగ్గురికి గాయాలు
- 8 మంది నిందితులు అరెస్టు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

భువనేశ్వర్: నగరం నడిరోడ్డు మీద యువకులపై కొంతమంది దాడి చేయడంతో భయానక వాతావరణం నెలకొంది. స్థానిక ఎయిర్‌పోర్టు రోడ్డులో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ దాడిలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. సుమారు 20 మంది యువకులు కత్తులు, ఇనుప రాడ్లు, కత్తులు వంటి మారణాయుధాలతో యువకులను వెంబడించి హత్యాయత్నం చేశారు. పోలీసుస్టేషన్‌కు కేవలం 500 మీటర్ల దూరంలోనే ఈ దాడి జరగడం మరింత భయాందోళనలకు గురి చేస్తోంది. దాడిలో స్థానిక ఝుడేశ్వరి ఝొరొణా సాహికి చెందిన శివ అలియాస్ మదన్ మహరణ, ఆయన అనుచరుడు స్థానిక యూనిట్-6కి చెందిన పిచ్చూ, బస్తీకి చెందిన రాకా నాయక్‌లు గాయపడ్డారు. వీరిలో శివ పరిస్థితి విషమించడంతో స్థానిక ఎయిమ్స్ ఆస్పత్రికి ఉన్నత చికిత్స కోసం తరలించారు. ఈ దాడికి పాల్పడిన 8 మంది నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరి దగ్గర నుంచి దాడిలో వినియోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. స్థలం కబ్జా నేపథ్యంలో ఈ వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుని ఈ అఘాయిత్యాన్ని ప్రేరేపించినట్లు ప్రాథమిక సమాచారం. కేసు తదుపరి విచారణ కొనసాగుతోంది.

ట్రక్కు ఢీకొని ఎలుగు దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎలుగుబంటి

జయపురం: బొరిగుమ్మ–నవరంగపూర్ 26వ జాతీయ రహదారిలో సోమవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు ఏర్పడడంతో రోడ్డు దాటుతున్న ఒక ఎలుగుబంటిని అటుగా వస్తున్న ట్రక్కు ఢీకొంది. ఈ ఘటనలో సంఘటన స్థలం వద్దనే ఎలుగు దుర్మరణం చెందింది. పొగమంచు కారణంగా ట్రక్కు డ్రైవర్‌కు దారి కనిపించకపోవడంతో ఘటన చోటు చేసుకుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎలుగు మరణించిన విషయాన్ని స్థానికులు వెంటనే బొరిగుమ్మ అటవీ విభాగ అధికారులకు తెలియజేశారు. అటవీ సిబ్బంది వచ్చి తీవ్రంగా గాయపడిన ఎలుగుబంటిని వెంటనే బొరిగుమ్మ పశువైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే ఎలుగు మరణించినట్లు డాక్టర్లు తెలియజేశారు. అటవీ విభాగ నిబంధనలు ప్రకారం అంతిమ సంస్కారాలు చేశారు.

యువకుడికి గాయాలు



నొప్పితో బాధపడుతున్న సుబు పోడియామి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి తేల్‌రాయి పంచాయతీ యకల్‌గూడ గ్రామంలో నూర్పిడి యంత్రంలో చేయి ఉండిపోవడంతో యువకుడి చేయి విరిగిపోయింది. గ్రామానికి చెందిన సుబు పోడియమి (22) ధాన్యం నూర్పిడి చేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్‌లో చేయి ఉండిపోయింది. దీంతో స్థానికులు వెంటనే అతడిని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏసుక్రీస్తు జననం..
జగమంతా సంబరం

లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని రాష్ట్రమంతటా ఘనంగా సోమవారం నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలు ప్రభు రాకకు స్వాగతం పలికాయి. మానవాళి రక్షణకు అవతరించిన క్రీస్తుకు ఆదివారం అర్ధరాత్రి నుంచి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు స్తుతి గేయాలతో ప్రభువును ప్రార్థించారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: సెంటినరీ బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ గీతాలాపన



బరంపురం: దీపాల్ స్కూల్లో ఆకట్టుకుంటున్న జీసస్ జన్మ అవతార నమూనా



పర్లాకిమిడి: రోమన్ కాథలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



బరంపురం: పుల్లణిలో ఆకట్టుకుంటున్న ఏసుప్రభు ఎగ్జిబిషన్



రాయగడ: చర్చిలో ప్రార్థనలు



రాయగడ: లూథరన్ చర్చి పాస్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాగావళి లయన్స్ క్లబ్ సభ్యులు



బరంపురం: సెయింట్ జోసెఫ్ స్కూల్లో జీసస్ జన్మ వృత్తాంతం తెలిపే నమూనా




కొరాపుట్: సామూహిక ప్రార్థనలకు హాజరైన ప్రజలు



బరంపురం: కొందమాల్ జిల్లా దరింగబడిలో క్రిస్మస్ వేడుకలు



జయపురం: చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం: క్రిస్మస్ వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సుదర్శన్ పట్నాయక్‌కు ప్రపంచ రికార్డు



వరల్డ్ రికార్డ్ బుక్ ఆఫ్ ఇండియా ధ్రువపత్రం అందుకుంటున్న సుదర్శన్ పట్నాయక్



రూపొందించిన శాంటాక్లాజ్ సైకత శిల్పం

భువనేశ్వర్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రఖ్యాత సైకత కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో ఉల్లిగడ్డలతో ఆవిష్కరించిన శాంటాక్లాజ్ సైకత శిల్పం ప్రపంచంలో ఉల్లిగడ్డలు, ఇసుకతో రూపుదిద్దుకున్న అతిపెద్ద సైకత శిల్పంగా ప్రపంచ రికార్డును నెలకొలిపింది. వరల్డ్ రికార్డ్ బుక్ ఆఫ్ ఇండియా ప్రధాన సంపాదకురాలు సుష్మా నార్వేకర్, సీనియర్ న్యాయనిర్ణేత సంజయ్ నార్వేకర్‌లు దీనిని కొత్త ప్రపంచ రికార్డుగా ప్రకటించారు. ఈ సందర్భంగా పూరీ బీచ్‌లో సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్‌కు అధికారిక సర్టిఫికెట్, పతకాన్ని అందజేశారు. ఇసుక, ఉల్లిగడ్డలతో చేసిన ఈ 100 అడుగుల సువిశాల సైకత శాంటాక్లాజ్ జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. దీని తయారీలో 2 టన్నుల ఉల్లిపాయలను ఉపయోగించారు. 100 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల వెడల్పుతో సువిశాలంగా ఈ శిల్పం తీర్చిదిద్దేందుకు సుదర్శన్ పట్నాయక్ బృందం నిర్విరామంగా 8 గంటలు శ్రమించారు.

కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా అజయ్ కుమార్



అజయ్ కుమార్

భువనేశ్వర్: వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఒడిశాతో సహా కొన్ని రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమించింది. దీంతో కాంగ్రెస్ సంస్థాగత పదవుల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కె.సి.వేణుగోపాల్ జారీ చేసిన జాబితా ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా డాక్టర్ అజయ్ కుమార్ నియమితులయ్యారు. ఆయనకు తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల బాధ్యతలు అదనంగా కేటాయించారు. ఇంతవరకు రాష్ట్ర ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఎ.చెల్లకుమార్‌కు మేఘాలయ, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్‌ల బాధ్యతలు అప్పగించారు.

ముగిసిన సన్‌ఫెస్ట్



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం



నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థిని

రాయగడ: స్థానిక పితామహల్ గ్రామంలోని సెంచూరియన్ విద్యాసంస్థల 13వ వార్షికోత్సవం సందర్భంగా సన్‌ఫెస్ట్ పేరుతో నిర్వహిస్తున్న వేడుకలు సోమవారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లోక్‌నాథ్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యతోనే వికాసం సాధ్యమని పేర్కొన్నారు. పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలు సాధించాలన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రాజేష్ పాడి మాట్లాడుతూ విద్యాసంస్థలు వ్యాపార దృక్పథంతో కాకుండా, విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించేవిధంగా కృషి చేసినప్పుడే ఆయా సంస్థలకు ఆదరణ పెరుగుతుందన్నారు. 13 ఏళ్ల కాలంలో తమ సంస్థల్లో చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది ప్రయోజకులవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నబరంగ్‌పూర్‌లో మంత్రి సరక పర్యటన



వేదిక మీద మంత్రి సరక, ఎంపీ రమేష్ తదితరులు

కొరాపుట్: రాష్ట్రమంత్రి జగన్నాథ సరక నబరంగ్‌పూర్ జిల్లాలో సోమవారం పర్యటించారు. ఉదయం రోడ్డు మార్గాన జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌కి చేరుకున్నారు. మంత్రికి స్థానిక బీజేడీ నాయకులు మంజులా మఝి, తపస్ త్రిపాఠి, ప్రమెద్ రథోలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. అనంతరం ఉమ్మర్‌కోట్ పట్టణంలోని బిజూ పట్నాయక్ స్టేడియంలో జరుగుతున్న ఉమ్మర్‌కోట్ క్రికెట్ లీగ్ మ్యాచ్ తిలకించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాలతో క్రీడల్లో రాణిస్తున్న యువత అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మఝి, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మఝి తదితరులు పాల్గొన్నారు.

భారీ మావో డంప్ స్వాధీనం



డంప్‌లోని సామగ్రి చూపిస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల పోలీసుస్టేషన్ పరిధి కూర్మానూర్ పంచాయతీ గ్రామ అడవిలో ఆదివారం సాయంత్రం జవాన్లు భారీ మావో డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయం వద్ద డంప్‌లో స్వాధీనం చేసుకున్న సామగ్రిని సోమవారం ప్రదర్శించారు. డంప్‌లో టిఫిన్ బాంబ్‌లు 15 కేజీల ఐఈడీ, మూడు కిలోల ఐఈడీ టిఫిన్ బాంబులు 2, ఎనిమిది కిలోల ఐఈడీ టిఫిన్ బాంబు 1, ఆరు కిలోల ఐఈడీ టిఫిన్ బాంబు 1, జిలెటిన్ స్టిక్స్ కట్టలు, డిటోనేటర్, చిన్న గ్యాస్ సిలెండర్, ఎలక్ట్రికల్ వైర్ 40 మీటర్లు, నాటు తుపాకీ, తుపాకీ గండ్లు ఉన్నాయి. ఈ డంప్ దాదాపు 10 సంవత్సరాల క్రితం నుంచే ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. డంప్ స్వాధీనం చేసుకున్న జవాన్లను ఎస్పీ నితీష్ వాద్వానీ అభినందించారు.

శ్రీక్షేత్రంలో భక్తుల రద్దీ

- సెలవుల కారణంగా పెరిగిన తాకిడి
- కొత్త సంవత్సరానికి మరింత రద్దీ
- పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్న యంత్రాంగం



భువనేశ్వర్: పూరీ శ్రీమందిరానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకుని పూరీ శ్రీజగన్నాథుని దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు, పర్యాటకులు, యాత్రికులు, సందర్శకుల తాకిడి సహజంగా పెరుగుతుంది. అయితే ఈ రద్దీ ఇప్పటినుంచే పుంజుకోవడం విశేషం. క్రిస్మస్ కారణంగా వరుసగా సెలవులు కావడంతో గత 2 రోజులుగా భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. కొత్త సంవత్సరం ఆరంభం నాటికి స్వామివారి ఆశీస్సులు పొందేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో శ్రీక్షేత్రంలో సజావుగా దర్శనం కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీజగన్నాథ దేవాలయ పాలక వర్గం (ఎస్‌జేటీఏ) భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టింది. భారీగా తరలివస్తున్న భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసు రక్షణ ఏర్పాట్లు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రత్యేక చర్యల్లో భాగంగా ఆలయం వెలుపల బారికేడ్లతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

సాగర తీరంలో నిఘా

భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా పర్యాటకుల కోసం ప్రత్యేకంగా సాగర తీరం సమీపంలో ప్రత్యేక పోలీసు సిబ్బంది, హోంగార్డులు, లైఫ్ గార్డులను నియమించారు. భక్తులు సజావుగా తిరుగాడేందుకు, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో సముద్ర తీరంలో కెరటాల్లో కొట్టుకుపోయే వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కూడా చేశారు. శ్రీజగన్నాథ ఆలయం పరిసరాల్లో రద్దీ పురస్కరించుకుని శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఒక అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు సహా 36 సెక్షన్ల పోలీసు బలగాలను ప్రత్యేకంగా నియమించారు. అదేవిధంగా బీచ్‌లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో 3 సెక్షన్ల పోలీసు బలగాలు, 30 మంది హోంగార్డులను మోహరించారు. పూరీ పట్టణంలో ట్రాఫిక్ నిర్వహణ కోసం డీఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, 4 సెక్షన్ల పోలీసు సిబ్బంది, 20 మంది హోంగార్డులను నియమించారు. కొత్త సంవత్సరాది రద్దీ నేపథ్యంలో అంచెలంచెలుగా పోలీసు భద్రతా వ్యవస్థని మరింత విస్తరిస్తారు. ఈ క్రమంలో 3 మంది అదనపు పోలీసు సూపరింటెండెంట్‌లు, 4 మంది డీఎస్పీలు, 11 మంది ఇన్‌స్పెక్టర్లు, 7 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలతో సహా 70 మంది హోంగార్డులను నియమించనున్నారు. మొత్తం 55 సెక్షన్ల పోలీసు బలగాలు కూడా నిమగ్నమై ఉంటాయని సమాచారం.

ప్రవేశ మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు

పూరీ పట్టణంలో మూడు ప్రధాన ప్రవేశ ప్రాంతాల్లో రాత్రింబవళ్లు పోలీసు పహరా ఏర్పాటు చేశారు. మంగళా ఘాట్ వీధి, బట్గాగాంవ్ వీధి, గ్రిడ్ స్టేషన్ వీధి మూడు ప్రధాన ప్రవేశ ప్రాంతాల్లో 24 గంటల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు శాఖ తెలిపింది.

మంచు ప్రభావం

సోమవారం దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో భక్తుల దర్శనం, స్వామివారి ప్రాతఃకాల సేవాదులు ప్రభావితం అయ్యాయి. ఈ వాతావరణంలో వేకువ జామున తలుపులు తెరవడం ఆలస్యమైంది. దీంతో తదనంతర సేవాదుల నిర్వహణలో కొంతమేరకు జాప్యం చోటు చేసుకుంది. వెంబడి భక్తుల సర్వ దర్శనంలో ఆలస్యం చోటుచేసుకుంది.

క్లుప్తంగా

జనవరిలో మల్కన్‌గిరి విమానాశ్రయం ప్రారంభం



తుది మెరుగులు దిద్దుకుంటున్న మల్కన్‌గిరి విమానాశ్రయం

భువనేశ్వర్: నక్సల్స్ ప్రభావిత మల్కన్‌గిరి జిల్లా దశ మారనుంది. సుదూర మల్కన్‌గిరి జిల్లాకు త్వరలో షెడ్యూల్డ్ విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. 2024 సంవత్సరం జనవరిలో ఈ విమానాశ్రయం ప్రారంభించేందుకు లాంఛనంగా నిర్ణయించారు. త్వరలో సుముహూర్తం ప్రకటిస్తారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ విమానాశ్రయం ప్రారంభిస్తారు. 2018 సంవత్సరం జూలై నెలలో మల్కన్‌గిరి జిల్లాలో గురుప్రియ సేతు ప్రారంభించడంతో ఈ జిల్లా పురోగతి సరికొత్త మలుపు తిరిగింది. స్వాభిమాన్ అంచల్‌గా పేరొందిన ఈ ప్రాంతం బహుముఖ అభివృద్ధికి అపారమైన అవకాశాలు అంది వచ్చాయి. త్వరలో నక్సల్ హాట్‌బెడ్‌కు నేరుగా విమాన కనెక్టివిటీ లభిస్తుంది.

అయోధ్యకు పాదయాత్ర


కాలి నడకన అయోధ్య వెళ్తున్న యువకులు

మల్కన్‌గిరి: జిల్లాకు చెందిన దినేష్ పట్నాయక్, భగవాన్ దుర్గ్ అనే ఇద్దరు భక్తులు జనవరి 22వ తేదీన అయోధ్యలో రామ మందిరం ప్రారంభాన్ని పురస్కరించుకొని అయోధ్యకు పాదయాత్ర ఆదివారం ప్రారంభించారు. దాదాపు 1,200 కిలోమీటర్లు ప్రయాణించి అక్కడికి చేరుకోనున్నారు. రోజుకు సుమారు 40 కి.మీ దూరం నడిచి, తమ్సానది నీటిని అయోధ్యకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

అలరించిన కన్యాశుల్కం


కన్యాశుల్కం నాటకం జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: స్థానిక అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ పుష్కరిణి వద్ద వైజయంతి ఉత్సవ వేదికలో గురజాడ కన్యాశుల్కం నాటకం సోమవారం సాయంత్రం అద్భుతంగా ప్రదర్శించారు. దివంగత రాజకీయ వేత్త, సినీ నటుడు, మాజీ మంత్రి చిగిలిపల్లి శ్యామలరావు జ్ఞాపకార్థం ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ సమక్షంలో శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 31 వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న క్రమంలో తొలిరోజున చిగిలిపల్లి శ్యామలరావు ట్రస్ట్ సౌజన్యంతో కన్యాశుల్కం నాటకాన్ని సుమిత్ర కళాసమితి సభ్యులే ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమంలో సుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కె.సోమేశ్వరరావు, చిగిలిపల్లి శ్యామలరావు ట్రస్ట్ ప్రతినిధులు చిగిలిపల్లి శిరీషా శ్రీనివాస్, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మున్సిపల్ ఇంజినీర్ డాక్టర్ సుగుణాకరరావు, అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గుంట తులసీరావు, నాగావళి కృష్ణ, పులఖండం శ్రీనివాసరావు, యామిజాల గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నిశిరాత్రిలో ప్రసవం


ప్రభుత్వ 108 అంబులెన్సులో ప్రసవమైన రజినీ, పక్కన బిడ్డను చూపుతున్న సిబ్బంది

కాశీబుగ్గ: రాత్రి మూడు గంటల సమయంలో పురిటి నొప్పులు అనుభవిస్తున్న ఓ గర్భిణికి 108 సిబ్బంది సపర్యలు చేసి ప్రసవం చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి అనంతపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న కె.రోజాకు అర్ధరాత్రి దాటిన అనంతరం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు పలాస 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన బయల్దేరి అనంతపురం చేరుకుని రోజాను అంబులెన్స్ ఎక్కించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ రాత్రి పూట వైద్యులు అందుబాటులో లేకపోవడం, కడుపులో బిడ్డ విషయంలో ఏదో తేడా ఉందని అక్కడున్న సిబ్బంది టెక్కలి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో టెక్కలికి వెళ్తుండగా మార్గం మధ్యలోనే ఆమెకు పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో రోడ్డుపైనే ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈఎంటీ డి.హేమరాజు, పైలెట్ బి.రవి కుమార్‌లు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఆస్పత్రికి చేరారు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సవాలకు వేళాయె..!

- రాయగడలో నేటి నుంచి చొయితి ఉత్సవాలు
- ఈనెల 30 వరకు వేడుకలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నుంచి జరగనున్న చొయితి వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఐదు రోజులు జరిగే ఈ వేడుకలు ఈనెల 30తో ముగుస్తాయి. ఆదివాసీ, హరిజన భాష, సంస్కృతి, కళలను పరిరక్షించడంతో పాటు అందరికీ ప్రతీ ఏడాది ఆనందాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం చొయితి పేరిట ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు పూర్తయ్యాయి. జిల్లా అదనపు ఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రో, ఆర్డీవో శివశంకర్ చౌదరి, జిల్లా గ్రామీణాభివృద్ధి ఎగ్జిక్యూటివ్ అధికారి కాంత్ కుహరో, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితర అధికారులు మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

200 స్టాల్స్ ఏర్పాటు

ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను తెలిపేలా 200 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాల కోసం రూ.70 లక్షలు వెచ్చించేందుకు జిల్లా యంత్రాంగం నిధులు సమకూర్చింది. అయితే గతేడాది ఉత్సవాల కోసం సుమారు రూ.92 లక్షలు ఖర్చయినట్లు అధికారులు లెక్కలు చూపించగా, ఈసారి దుబారా ఖర్చుల లేకుండా చూడాలని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో చొయితి వేడుకల ఖర్చులను తగ్గించినట్లు సమాచారం.

స్వాగత ద్వారాలు ఏర్పాటు

ఆదివాసీ సాంప్రదాయాలతో కూడిన వాయిద్యాలు, భాషా, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా చొయితి ఏంబ్లామ్‌ను అధికార యంత్రాంగం విడుదల చేసింది. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రధాన మార్గాల్లో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేసింది. దీంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ సుమారు లక్ష మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. దీంతో అన్ని ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 20 ప్లాటూన్ల బలగాలను మోహరిస్తున్నట్లు తెలియజేశారు.

వేదిక సిద్ధం

చొయితి ఉత్సవాలకు సాంస్కృతిక వేదిక సిద్ధమయ్యింది. ఎల్ఈడీ విద్యుత్ లైట్లతో ఈసారి సుందరంగా వేదికను తీర్చిదిద్దారు. గతేడాది వేదిక నిర్వహణ, స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించి ఇతర ప్రాంతాలకు చెందినవారిని జిల్లా యంత్రాంగం రప్పించింది. అయితే స్థానికుల అభ్యంతరాల మేరకు ఈసారి పట్టణంలో ఉన్నవారికే ఈ అవకాశం దక్కింది.

కలశ యాత్రతో ప్రారంభం

ప్రజల ఆరాధ్య దైవం మజ్జిగౌరి మందిరంలో మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం చొయితి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. దీనిలో భాగంగా సాయంత్రం 4 గంటలకు కలశ యాత్ర నిర్వహిస్తారు. ఈ యాత్ర మజ్జిగౌరి మందిరం నుంచి ప్రారంభమై స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానం వరకు కొనసాగుతుంది. ఈ యాత్రలో వేలాది మంది జనం పాల్గొనున్నారు.


చొయితి పోస్టర్


ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం


జయపురం గాంధీ కూడలి వద్ద మంటలు వేసుకొని చలికాగుతున్న ప్రజలు

● వణికిస్తున్న చలి

జయపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం నుంచి కురుస్తున్న దట్టమైన మంచు ప్రభావంతో భారీగా చలి కమ్ముకుంటోంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు ఉంటుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. చలి ప్రభావంతో ప్రజలు మంటలు వేసుకొని చలికాగుతున్నారు.

– జయపురం


జయపురం మెయిన్ రోడ్డులో పొగమంచు


జగన్నాథ సాగర్ రోడ్డులో పొగమంచు

ఆదిత్యుని సన్నిధిలో సినీ నటి సురభి


నటి సురభికి ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న మండవిల్లి రవి, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ నటి సురభి పురాణిక్ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం అరసవల్లి క్షేత్రం విశిష్టతను ఆమెకు శంకరశర్మ వివరించారు. ఈ సందర్భంగా నటి సురభి మాట్లాడుతూ తెలుగు, తమిళ బాషల్లో పలు సినిమాలు చేశానని, ఈ ఏడాదిలో డిడి రిటర్న్స్ అనే తమిళ సినిమాలో నటించానన్నారు. వచ్చే 2024లో కొత్త ప్రాజెక్టులతో పలు సినిమాల్లో నటించనున్నట్లుగా వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

షాదీఖానా మంజూరు

కోటబొమ్మాళి: కొత్తపేట పంచాయతీలోని జగనన్న కాలనీ సమీపంలో ముస్లింల కోసం షాదీఖానా నిర్మాణానికి స్థలంతో పాటు నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన సమయంలో కొత్తపేటకు చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్‌రాజూబాయ్ షాదీఖానా మంజూరుచేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో సీఎం కలెక్టర్‌కు ఆదేశించడంతో ఆయన తహసీల్దార్ జామి ఈశ్వరమ్మను అప్రమత్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ 10 సెంట్ల స్థలాన్ని గుర్తిస్తూ మంజూరుకు ఇటీవలి ప్రతిపాదన పంపారు. అడిగిన వెంటనే ముఖ్యమంత్రి స్పందించి షాదీఖానా మంజూరు చేశారని, నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రంజాన్‌రాజూబాయ్ సోమవారం తెలిపారు.

ఆదర్శనీయుడు వాజ్‌పేయి


వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమాజ్ ప్రతినిధులు


వృద్ధాశ్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ మహిళా మోర్చ సభ్యులు

బరంపురం: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శనీయుడని వక్తలు అన్నారు. స్థానిక కోర్టుపేట జంక్షన్‌లోని శివాలయ ప్రాంగణంలో సర్దార్ వల్లబాయి పటేల్ బహుముఖి సమాజ్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామ్ పాత్రో మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ గంజాం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సైతం జయంతి వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా లుచ్చాపడా రోడ్‌లోని జరా నివాస్‌లో ఉన్నటువంటి వృద్ధాశ్రమంలో పండ్లు పంచిపెట్టారు. అదేవిధంగా అస్కా రోడ్‌లో బీజేపీ యువ మోర్చా నాయకులు చెట్లు నాటారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు కన్ను చరణ్‌పతి, భిభుతి జెనా, శిశిర్ కుమార్ పాఢి, సుభాషిని పట్నాయక్, టమన్న పాఢి, రాజేంద్ర కుమార్ సాహు, కైలాష్ సడంగి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల స్వప్నం సాకారం

- శంకుస్థాపన చేసిన 9 నెలల్లోనే మూలపేట పోర్టు ఆకృతి నిర్మాణాలు
- 1000 మీటర్లకు పైగా సౌత్ బ్రేక్ వాటర్ పనులు
- 501 మీటర్లకు పైగా నార్త్ బ్రేక్ వాటర్ పనులు
- అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభం

టెక్కలి: జిల్లా ప్రజలు దశాబ్దాలుగా కంటున్న కల నేటికి సాకారమవుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతబొమ్మాళి మండలం మూలపేట ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు శ్రీకారం చుట్టడమే కాకుండా.. అన్ని అవాంతరాలు దాటుకుని శంకుస్థాపన చేయడంతో పాటు కేవలం 9 నెలల వ్యవధిలోనే పోర్టు నిర్మాణాలు వేగవంతం చేసి ఓ ఆకృతికి తీసుకువచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసిన తర్వాత ఎక్కడా పనులకు ఆటంకం లేకుండా చకాచకా వేగవంతం చేస్తున్నారు. ఇటీవల పలాస విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఏరియల్ వ్యూ ద్వారా పనులను పరిశీలించారు.


మూలపేట పోర్టులో బెర్త్ ల నిర్మాణాలు

వడి వడిగా సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ పనులు

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టులో ఇప్పటికే 1000 మీటర్లకు పైగా సౌత్ బ్రేక్ వాటర్ పనులు, 501 మీటర్లకు పైగా నార్త్ బ్రేక్ వాటర్ పనులు జరిగాయి. వీటితో పాటు టెక్కలి జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు పనులకు చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయి. అంతే కాకుండా పోర్టు ఏరియాలో బెర్త్‌ల నిర్మాణాలు సైతం ఊపందుకున్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరో వైపు నౌపడ వద్ద పునరావాస కాలనీ నిర్మాణాలకు క్షేత్ర స్థాయిలో పనులు చేపడుతున్నారు.


టెక్కలి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని అప్రోచ్ రోడ్డు పనులు


మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణంలో వెయ్యి మీటర్లకు పైగా సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం


ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ట్రాఫిక్ పీఎస్‌కు తరలిస్తూ..


రిమ్స్‌లో మృతిచెందిన పైడితల్లిని చూసి విలపిస్తున్న భార్య అప్పయ్యమ్మ

● యువకుల అతివేగమే కారణం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని మహిళా కళాశాల రోడ్డు మార్గంలోని మహలక్ష్మినగర్ సందులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే కాలనీకి చెందిన కొండపల్లి పైడిపల్లి (72) అనే వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. ముగ్గురు యువకులు అతివేగంతో ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్, మృతుని భార్య అప్పయ్యమ్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

మహలక్ష్మి నగర్ కాలనీకి చెందిన కొండపల్లి పైడితల్లి, తన భార్య అప్పయ్యమ్మతో కలిసి జీవిస్తున్నాడు. ఐదారేళ్ల క్రితం రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కాళ్లనొప్పులు రావడంతో ఇంటిపట్టునే ఉండటంతో భార్య వేరేవారి ఇళ్లలో పనిచేస్తూ పోషిస్తున్నారు. ఒక్కగానొక్క కుమార్తెకు వివాహమైంది. పైడితల్లి సాయంత్రం వేళ టీ తాగుదామని మహలక్ష్మినగర్ సందుదాటి ఉమెన్స్ కాలేజీ రోడ్డుకు వచ్చారు. టీ తాగి తిరిగి వెళ్తూ కాలువ దాటుతుండగా సూర్యమహల్ జంక్షన్ నుంచి ఉమెన్స్ కాలేజీ రోడ్డు మలుపులో ముగ్గురు యువకులు స్ప్లెండర్ బైక్ అతివేగంతో వచ్చి వృద్ధుడిని ఢీకొట్టారు. వారు ఢీకొట్టిన వేగానికి వృద్ధుడు దాదాపు 13 అడుగుల దూరం తుళ్లిపోయారు. తలకు బలమైన గాయమైంది. ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు యువకులు పరారయ్యారు. డ్రైవింగ్ చేసిన యువకుడు వృద్ధుడికి సపర్యలు చేసి తన తండ్రి సాయంతో అంబులెన్స్ ఎక్కించి రిమ్స్‌కు తరలించారు. అయితే ఆస్పత్రి చేరేలోగానే వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. భర్త మృతదేహాన్ని చూసి అప్పయ్యమ్మ చిన్నపిల్లలా రోదించడం అక్కడున్న వారి చేత కంటతడి పెట్టించింది. ప్రమాదానికి కారణమైన ముగ్గురూ మైనర్లేనని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇదే ప్రాంతంలో ఈ నెల 17న కూడా ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. అప్పుడు కూడా బైక్ అతివేగం కారణంగానే ఓ యువకుడు చనిపోయాడు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వృద్ధుని ప్రమాదంపై అతని భార్య అప్పయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు.

నాలుగు అంచెల రొయ్య ఫారంలతో లబ్ధి

గార: రొయ్యల పెంపకంలో నూతన విధానమైన నాలుగు అంచెల ఫారంలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర మత్స్యశాఖ సెక్రటరీ అభిలాక్షి లిఖి అన్నారు. సోమవారం తోనంగి వద్ద లక్ష్మీపతిరాజు నిర్వహించిన రొయ్యల చెరువును ఆయన పరిశీలించారు. సముద్ర ఇసుక దిబ్బలపై సులువుగా ఏర్పాటు చేసేందుకు ఈ విధానం పనికి వస్తుందన్నారు. ఈ విధానంలో నాణ్యమైన రొయ్య దిగుబడితో పాటు వైరస్ దాడి చాలా తక్కువగా ఉంటుందన్నారు. నూతన పద్ధతిలో రొయ్యలకు మేత వేసే విధానం కూడా చెరువులో ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ అందించడం కూడా కొత్త విధానం ద్వారా అమలు చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో రైతులకు కూడా ఇక్కడ శిక్షణ అందిస్తామన్నారు.


నూతన విధానాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మత్స్యశాఖ సెక్రటరీ అభిలాక్షి లిఖి

కార్యక్రమంలో విశాఖపట్నం ఫిషరీస్ జేడీ లాల్ మహమ్మద్, శ్రీకాకుళం జేడీ వై. సత్యనారాయణ, ఎఫ్‌డీఓ బగాది సురేష్‌కుమార్, సుబ్బరాజు, జగదీష్‌రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామతీర్థం అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



శిలాఫలకం ఏర్పాటుపై దేవస్థాన సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామతీర్థం దేవస్థానం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. రామస్వామి దేవస్థానాన్ని సోమవారం ఆయన సందర్శించి, ఈ నెల 28న జరగనున్న భాస్కర పుష్కరిణి అభివృద్ధి పనులపై దేవస్థాన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.75 లక్షలతో భాస్కర పుష్కరిణిని అభివృద్ధి చేశామన్నారు. కోనేరును అభివృద్ధి చేయడంతో పాటు కొత్తగా ఒక పుష్కర ఘాట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ నెల 28న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఇతర ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే బోడికొండపై శిథిలమైన కోదండ రామాలయాన్ని రూ.3 కోట్ల నిధులతో పునర్నిర్మించామని, దిగువనున్న రామాలయంలో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు అంబళ్ల కిరణ్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

విజయనగరం టౌన్: పట్టణంలోని సిటీ బస్టాండ్ వద్దనున్న కనక మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో సోమవారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మధుర పదార్థాలతో నివేదన చేశారు. అనంతరం పంచహారతులిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పదిబస్తాల ధాన్యం దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు బాలి తులసినాయుడు పది బస్తాల దగ్ధమయ్యాయి. వరిపంటను నూర్పి ధాన్యం విక్రయించేందుకు కళ్లంలో భద్రపరచగా ఆ ధాన్యం బస్తాల పక్కనే వరిగడ్డివాములు ఉన్నాయి. ఉన్నపళంగా గడ్డివాములకు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న ధాన్యం దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలుసుకున్న సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడు రాజాం ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఓ వైపు రైతులు అప్రమత్తమై మంటలను అదుపుచేయడంతో రాజాం నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా నిలువరించారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ మెంబర్ కోరాడ వేణుగోపాల్

చీపురుపల్లి: ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో గరివిడి మండలంలోని కేఎల్ పురం, కోడూరు గ్రామాలకు చెందిన పి.రేణుక, జి.వాసు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పి.రేణుక 5 కి.మీ రేసులో బంగారు పతకం, 10 కి.మీ రేసులో రజత పతకం సాధించింది. దీనితో ఈ నెల 28,.29 తేదీల్లో భువనేశ్వర్‌లో జరగనున్న సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. అలాగే కోడూరుకు చెందిన వాసు 20 కి.మీ వాకింగ్‌లో బంగారు పతకం సాధించి ఈ నెల 29, 30 తేదీల్లో తమిళనాడులో జరగనున్న సౌత్‌వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ ఇద్దరు క్రీడాకారులు ఆంధ్రా యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ మెంబర్ పట్టణానికి చెందిన కోరాడ వేణుగోపాల్ వద్ద శిక్షణ పొందుతున్నారు. బంగారు పతకాలు సాధించిన ఇద్దరినీ ఆయన అభినందించారు.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడి..!

- ఏటికేడాది పెరుగుతున్న మొక్కజొన్న సాగు
- రబీలో మంచి లాభం కురిపిస్తున్న పంట
- రైతులకు అనుకూలంగా మద్దతు ధర



సంతకవిటి మండలం జీఎస్‌పురం సమీపంలో మొక్కజొన్న



రాజాం మండలం లక్ష్మీపురం సమీపంలో విస్తారంగా మొక్కజొన్నసాగు

రాజాం: నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు మెట్టు ప్రాంతాల్లో వందరోజుల వ్యవధిలో పంట చేతికందడంతో పాటు మంచి దిగుబడి కూడా ఉండడంతో మొక్కజొన్న పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఈ పంట సాగు రానురాను పెరుగుతూ వస్తోంది. గతేడాది విజయనగరం జిల్లాలో 23,664 హెక్టార్లలో రబీసీజన్‌లో మొక్కజొన్నపంటను రైతులు సాగుచేశారు. ఈ క్రాప్ నమోదు పూర్తిచేయడంతో పాటు సకాలంలో పంట కూడా చేతికంది వచ్చింది. మద్దతు ధర క్వింటాకు రూ.1962లు ప్రభుత్వం ప్రకటించింది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. ఇదే సమయంలో ప్రైవేట్ కంపెనీలు కూడా ముందుకు వచ్చి ప్రభుత్వ మద్దతు ధర కంటే అదనంగా క్వింటాకు రూ.100 నుంచి రూ. 200లు చెల్లించి రైతులు వద్ద కొనుగోలు చేశాయి. గతేడాది జిల్లాలో 2.07 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చింది. పలు ప్రాంతాల్లో ఈపంట అకాల వర్షాల కారణంగా నష్టపోగా ప్రభుత్వం 395 హెక్టార్లలోని రైతులకు రూ.49.46 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ ఏడాది రైతులు ఇదే తరహాలో మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఖరీఫ్ వరి పూర్తయిన ప్రాంతాల్లో మొక్కజొన్న పంట వేస్తున్నారు. ఇప్పటికే 22 వేల హెక్టార్లలో ఈ పంటను వేస్తున్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా. ఈ సాగు మరింత పెరిగి ఈ రబీలో 28 వేల హెక్టార్లకు చేరుతుందని భావిస్తున్నారు. మొత్తం 40 వేల మంది రైతులు ఈ ఏడాది రబీలో మొక్కజొన్నసాగుపై ఆసక్తిగా ఉన్నారు. వారంతా ఇప్పటికే పొలాలు సిద్ధం చేసుకుని పలుచోట్ల విత్తనాలు జల్లారు. వంద నుంచి 110 రోజుల్లో చేతికందివచ్చే ఈ పంట ద్వారా ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల మొక్కజొన్న గింజలను దిగుబడి చేయవచ్చు. ఖర్చులు ఎకరాకు రూ.8వేలు నుంచి రూ.10 వేలు పెట్టినా, గింజల దిగుబడి ద్వారా ఖర్చులు పోను ఎకరాకు రూ.25 వేల మేర ఆదాయం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. తక్కువ పెట్టుబడితో పాటు కూలీల కొరత, సాగునీటి కొరతను అధిగమించి పంటను సాగుచేయగలగడమే ఈ పంట సాగుపై ఆసక్తి పెరుగుతోందని రైతులు తెలిపారు.

తక్కువ పెట్టుబడి



మొక్కజొన్న పంట తక్కువ సమయంలో చేతికందివస్తుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుంది. సకాలంలో విక్రయాలు చేయవచ్చు. గతేడాది రబీలో ఈ పంట సాగుచేయడం ద్వారా మంచి ఫలితం వచ్చింది. ఈ ఏడాది కూడా సాగుచేస్తున్నాను.

బగాది జగన్నాథరావు, రైతు, జీఎస్‌పురం, సంతకవిటి మండలం.

ఇబ్బంది లేని పంట



మొక్కజొన్న పంటకు సాగునీరు, పురుగుమందుల ఇబ్బందులు ఉండవు. తక్కువ వ్యవధిలో పంట చేతికొస్తుంది. అంతేకాకుండా పెట్టుబడి తక్కువగా ఉండి, ఎక్కువ ఆదాయం వచ్చే పంటగా మొక్కజొన్న ఉండడంతో సాగు అధికంగా చేస్తున్నాం. ఈ ఏడాది రబీలో పది ఎకరాల్లో ఈ పంట సాగుచేస్తున్నాం.

తాడ్డి గోపాలకృష్ణ, రైతు, లక్ష్మీపురం, రాజాం మండలం.

రైతులకు మంచి సాగు



రైతులకు మొక్కజొన్న పంట మంచి లాభదాయకం. ఈ పంట సాగుచేయడం ద్వారా రబీలో మంచి ఆదాయం వస్తుంది. తక్కువ నీటి వనరులు ఉన్నచోట కూడా పంటను బాగా సాగుచేయవచ్చు. రైతులు ఇంటిల్లిపాది కష్టపడి చక్కగా సాగుచేస్తే పెట్టుబడి కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఈ ఏడాది ఈ పంటను అధికంగా రైతులు సాగు చేస్తున్నారు. వరి తర్వాత ఈ పంట వేయడంతో పంట మార్పిడి విధానం కూడా ఉంటుంది.

కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

అస్వస్థతతో జిందాల్ కార్మికుడి మృతి



కార్మికుడు చిన్నారావు (ఫైల్)



మృతుడి కుటుంబ సభ్యులు, కార్మికనాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకుడు నెక్కల నాయుడుబాబు

- రూ.10 లక్షల పరిహారానికి అంగీకరించిన యాజమాన్యం

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామం సమీపంలో గల జిందాల్ ఫెరోఎల్లోయిస్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న లక్కవరపుకోట మండలంలోని సంతపేట గ్రామానికి చెందిన గోకేడ చిన్నారావు(56) అస్వస్థతకు లోనై సోమవారం మృతిచెందాడు. కార్మికుడి కుటుంబానికి పరిహారం కోసం కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌టీయూసీ నాయకుడు నెక్కల నాయుడుబాబు కర్మాగార యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కార్మికుడు చిన్నారావు ఎప్పటిలాగానే 'ఎ' షిఫ్ట్ విధులకు సోమవారం హాజరయ్యాడు. ఉదయం 10 గంటల ప్రాంతంలో పనిచేసిన ప్రదేశంలో గుండెల్లో మంట వస్తోందని చెప్పి అస్వస్థతకు లోనయాడు. వెంటనే తోటి కార్మికులు కొత్తవలస ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

26 సంవత్సరాలుగా చిన్నారావు ఇదే కార్మాగారంలో పనిచేస్తున్నాడు. ఆయన కుటుంబానికి పరిహారం అందించాలని యూనిట్ అధిపతి దినేష్‌శర్మతో కార్మిక సంఘం నాయుడు నెక్కల నాయుడుబాబుతో పాటు సీఐటీయూ ఇతర కార్మిక సంఘాల నాయకులు చర్చలు జరిపారు. దీంతో మృతుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు నెక్కల నాయుడుబాబు తెలిపారు. అలాగే మృతుడి అల్లుడు ఇటీవల మరణించగా కుమార్తెకు ఇద్దరు చిన్న ఆడపిల్లలు ఉన్నారు. వారికి 10వ తరగతి వరకు ఓపీ జిందాల్ పాఠశాలలో ఉచితంగా విద్యను అందించేందుకు యాజమాన్యం అంగీకరించిందని నాయుడుబాబు చెప్పారు. చర్చలు సఫలం కావడంతో మృతుడి కుటుంబసభ్యులు, కార్మిక సంఘం నాయుకులు నెక్కల నాయుడు బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాన్‌ఢీకొని వృద్ధుడు..



వృద్ధుడి మృతదేహం, ప్రమాదానికి కారణమైన వ్యాన్

బాడంగి: మండలంలోని గజరాయునివలస గ్రామానికి చెందిన వృద్ధుడు నడిమింటి సత్యనారాయణ(70) బొలెరో వ్యాన్ ఢీకొని సోమవారం మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో ఊసుపోక గ్రామంలో రోడ్డుపక్కన పాన్‌షాప్‌వద్దకు వచ్చి తనతోటి వృద్ధులతో మాట్లాడుతూ కాలక్షేపం చేస్తుండగా అదే సమయంలో గ్రామంలోకి వస్తున్న బొలెరో వ్యాన్ సత్యనారాయణ కాలిని ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకుపోగా ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్.జయంతి చెప్పారు. వ్యాన్‌డ్రైవర్ సంతోష్ దాస్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసినట్లు చెప్పారు. ఆ వ్యాన్ శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం వెల్లుపడకాలనీకి చెందినదన్నారు. సత్యం మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీకి పోస్టుమార్టంకోసం తరలించినట్లు ఎస్సై చెప్పారు.

విద్యుత్ షాక్‌కు గురై రైతు..



రైతు మృతదేహం



వాసుదేవరావు (ఫైల్)

రేగిడి: మండల పరిధి లక్ష్మీపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై గ్రామానికి చెందిన రైతు కెంబూరు వాసుదేవనాయుడు (38) సోమవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వాసుదేవనాయుడు కళ్లంలో వరిపంట నూర్పు చేస్తున్నాడు. పక్కనే గడ్డివాముపైకి వెళ్లేందుకు ఇనుప నిచ్చెన తీసుకువచ్చి గడ్డివాముకు వేస్తున్న సమయంలో పై నుంచి వెళ్తున్న విద్యుత్‌వైర్లకు నిచ్చెన తగలడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న తోటి రైతులు అప్రమత్తమై పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతునికి భార్య స్వప్న, కుమార్తె జోషియ ఉన్నారు. వాసుదేవనాయుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు భోరున విలపించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీవిశ్వకర్మ యోజన సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న గొలగాన

నెల్లిమర్ల: వెనుకబడిన తరగతుల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న శ్రీ విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొలగాన రమేష్ పిలుపునిచ్చారు. నెల్లిమర్ల పట్టణంలోని ఆదిత్య విద్యాలయంలో పథకానికి సంబంధించి అవగాహన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ఏర్పడిన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వెనుకబడిన తరగతుల ప్రజలకు బాసటగా నిలవాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా చేతి వత్తుల వారికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తారని, ఎటువంటి హామీ లేకుండా కేవలం 5 శాతం వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన ప్రజలు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గిడుతూరి రాము, కార్యదర్శి వి.సూరిబాబు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తం ఇస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: యువత రక్తదానానికి ముందుకు రావాలని ఏపీజే అబ్దుల్ కలామ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తం కొరతను నివారించడానికి రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన యువత ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ సలహాదారులు జేవీ రాకేష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

హాకీ జట్టు రాష్ట్ర కోచ్‌గా రమేష్



రాష్ట్రహాకీ జట్టు కోచ్‌గా నియమితులైన పీడీ రమేష్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండ లక్ష్మీపురం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పాండ్రంకి రమేష్ రాష్ట్ర హాకీ జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. ఈనెల 27 నుంచి జనవరి1 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ ప్రాంతంలో జరగనున్న 67వ జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టుకు ఆయనను కోచ్‌గా నియమిస్తూ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం పీవీ బాబూరావు, సహోపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు కీర్తిక ఎంపిక



రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో అవార్డు స్వీకరిస్తున్న కీర్తిక

గుమ్మలక్ష్మీపురం: 'వినియోగదారుల హక్కులు-చట్టాలు' అనే అంశంపై విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీల్లో గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని బి.కీర్తిక ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం బిడ్డిక బీముడు తెలిపారు. రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన కీర్తికకు సర్టిఫికెట్, నగదు బహుమతి, ట్రోఫీ, డిబేట్‌లో కన్సొలేషన్ బహుమతిని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకటనాగేశ్వరరావు, కమిషనర్ అరుణ్‌కుమార్ అందజేశారని చెప్పారు.

రెండు ఆటోలు ఢీ: తొమ్మిదిమందికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



రేగిడి: ప్రమాదంలో చేతిని కోల్పోయిన బాధితురాలు వావిలపల్లి కల్యాణి



రేగిడి : ప్రమాదంలో రెండుకాళ్లు విరిగిపోయిన రాములు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామం సమీపంలో సోమవారం రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో తొమ్మిదిమంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రాజాంలో జూట్ ఫ్యాక్టరీ నుంచి పాలకొండ వైపు వస్తున్న ప్రయాణికుల ఆటో, ఉంగరాడమెట్ట నుంచి రాజాం వెళ్తున్న మరో ప్రయాణికుల ఆటో పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజాం జూట్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న ఆటోలో ప్రయాణిస్తున్న అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన కార్మికురాలు వావిలపల్లి కల్యాణి తీవ్ర గాయాలపాలైంది. ఆమె కుడిమోచేతి భాగం వరకూ తెగి రోడ్డుమీద పడిపోయింది. రెండుకాళ్లకు తీవ్ర గాయాలవడంతో పాటు ఒక కాలు నుజ్జునుజ్జయింది. రక్తం మడుగులో బాధితురాలు కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు రోడ్డు పక్కకు తీసి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం 108 వాహనంలో రాజాం కేర్‌కు, అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ ప్రమాదంలో ఇదే ఆటోలో ప్రయాణిస్తున్న అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన మరో జూట్ కార్మికురాలు పనస దుర్గమ్మ తలపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఇదే గ్రామానికి చెందిన తాతపూడి సూరమ్మ నడుముకు గట్టి దెబ్బలు తగలడంతో పైకి లేవలేని పరిస్థితిలో ఉంది. తీవ్రగాయాల పాలైన వారిని 108 వాహనంలో రాజాంలోని జీఎంఆర్ కేర్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో ఉంగరాడమెట్ట నుంచి రాజాం వెళ్తున్న ఆటోలో ప్రయాణిస్తున్న చాటాయివలస గ్రామానికి చెందిన వాదారి రాములు రెండుకాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. మరో ప్రయాణికురాలు లక్ష్మీపురం గ్రామానికి చెందిన కెంబూరి బంగారమ్మ కుడికాలికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురు స్వల్పగాయాలుతో బయటపడ్డారు. వారిని కూడా 108 వాహనంలో రాజాం జీఎంఆర్ కేర్‌తో పాటు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న రేగిడి ఎస్సై ఇ.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీశారు. బాధితులను ఆస్పత్రికి తరలించడంతో పాటు వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ వర్సిటీ వాలీబాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థినులు



వి.సాయిసుచిత్ర



ఎం.స్వర్ణిక



వి.ధాత్రి

రాజాం సిటీ: తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో ఈ నెల 27 నుంచి 31 వరకు జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజాం జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు ఎంపికయ్యారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఎంపికలో కళాశాలకు చెందిన వి.సాయిసుచిత్ర, ఎం.స్వర్ణిక, వి.ధాత్రిలు జేఎన్‌టీయూ జీవీ జట్టు తరఫున ఎంపికయ్యారన్నారు. వారి ఎంపికపట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, డీన్ డాక్టర్ వి.రాంబాబు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

వాజ్‌పేయ్ నేతృత్వంలో సుపరిపాలన

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమంచి సుబ్బారావు



నిరుపేదలకు వస్త్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకుడు కుసుమంచి సుబ్బారావు

విజయనగరం టౌన్: దేశంలో సుపరిపాలన అందించిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయ్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమంచి సుబ్బారావు పేర్కొన్నారు. ఈ మేరకు వాజ్‌పేయ్ జయంతిని పురస్కరించుకుని కేఎల్.పురం యాతపేట కాలనీలో బీజేపీ జెండాను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కాలనీలో ఉన్న సుమారు 180 నిరుపేద కుటుంబాలకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించి గొప్ప పరిపాలన అందించిన వ్యక్తి వాజ్‌పేయ్ అని కొనియాడారు. విజయనగరం అసెంబ్లీ కన్వీనర్ ఇమంది సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అష్టలక్ష్మీ ఆలయ ఫౌండర్ దుర్గా బాలాజీ, నాలుగెస్సుల రాజు, కంది రాంబాబు, ఎం.బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చదురుగుడికి పెదపోలమాంబ

- మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి ఆహ్వానం



పెదపోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో తొలిఘట్టానికి దేవదాయశాఖ అధికారులు సోమవారం శ్రీకారంచుట్టారు. పోలమాంబ మేనత్త పెదపోలమాంబ ఘటాన్ని జన్నివారి ఇంటి నుంచి ఎస్.పెద్దవలస గ్రామానికి వెళ్లే రహదారిలోకి తీసుకెళ్లి పూజలు జరిపారు. ఈఓ వి.వి.సూర్యనారాయణ, పూజారులు రాము, జగదీశ్వరరావు, ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, కరణం కుటుంబీకులు పసుపుకుంకుమలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. అనంతరం మేళ తాళాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పెదపోలమాంబను చదురుగుడికి తీసుకువచ్చారు. అమ్మవారు గ్రామంలో ఆరు రోజులపాటు భక్తులకు దర్శనమిస్తారు. వచ్చే ఏడాది జనవరి 1న పెదపోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 2న ప్రధాన పండగ, 3న అనుపోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు శంబర పోలమాంబను ఆహ్వానించేందుకు సనప చాటింపువేస్తారు. జనవరి 8న శంబర పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తీసుకు వస్తారు. 13 రోజులపాటు అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 22న తొలేళ్లఉత్సవం, 23న సిరిమానోత్సవం, 24న అనుపోత్సవం నిర్వహిస్తారు.



పెద పోలమాంబ అమ్మవారి ఘటానికి పూజ చేస్తున్న ఈఓ సూర్యనారాయణ